
# పరోక్షం

వి. రాజారామ మోహనరావు



ఇంచుమించు తొమ్మిదిన్నరకి అక్కడికి వొస్తుంది సుజాత. తొమ్మిదీ నలభైకి బస్సు వొస్తుంది. అందులో ఆఫీసుకి వెళ్ళిపోతుంది.

నెమ్మదిగా సుజాత రావటం, వోపక్కగా నాజూగ్గా నిలబట్టం... బస్సు కోసం ఎదురుచూట్టం.... అంతా అదో ప్రత్యేక శైలి.

తొందరపాటు లేకుండా, తను సంచరించే పరిసరాలమీద పూర్తి అధికారం వున్నదాన్లా సుజాత ప్రవర్తించటం సుదర్శనాన్ని నిజంగానే ఆకర్షించింది. అంతేకాదు సుజాత అందంగా, అంతకన్నా మించి ఆకర్షణీయంగా కనిపించింది. పోతే సుజాత నలుపు.


సుజాత నలుపన్న సంగతి సుజాతని చూడకముందు నుంచీ సుదర్శనానికి తెలుసు. యింకా సుజాతకి ముప్ఫైరెండేళ్ళని, పెళ్ళి కాలేదని కూడా తెలుసు. అన్ని వివరాలు విన్నాకే సుజాతని పరీక్షగా చూట్టం, ఆమె తాలూకు వివరాలు సేకరించటం పనిగా పెట్టుకున్నాడు సుదర్శనం. తనిష్టపడితే పెళ్ళిచేసుకోటానికి సుజాత సుముఖంగా వుందన్న వార్త తెలిసింది సుదర్శనానికి.

మూడురోజులుగా చూస్తున్నాడు. సుజాత ఆఫీసుకి వెళ్ళటం. వుదయం సరిగ్గా అదే టైముకి వెళ్ళినా తిరిగి రావటం మటుకు అందర్లా అయిదున్నర ఆరింటికి రావటంలేదు. ఓ రోజు తొమ్మిదింటికి, మరోరోజు పదిన్నరకి, మూడోరోజు ఏడున్నరకీ వచ్చింది.

సుదర్శనం జీవితం సుదర్శనానికి మోతాదుమించి సందేహాల్ని నేర్పింది. రోడ్డుమీద నడిచేటప్పుడు చుట్టూవున్న అందరూ తనవేపే చూస్తున్నారేమో అన్నది వో సందేహం...ఏ ఆడవాళ్ళైనా నవ్వుతుంటే తనని చూసేనేమోనన్న సందేహం. సహజంగా సజావుగా వున్న జనం అందరూ తనని తక్కువ మనిషిగా, నేలమీద పాకే క్రిమికీటకాల్ని చూసినట్టు చూస్తున్నారేమో నన్న సందేహం.

ఎప్పుడేనా మరుగుజ్జువాళ్ళు, మరీ శారీరకంగా విచిత్రంగా వున్నవాళ్ళు కనపడితే తనకి ఎలా వుంటుందో, తనని చూస్తున్నప్పుడు జనానికి ఎప్పుడూ అలాగే తక్కువ దృష్టి వుంటుందన్న అనుమానం.

సుదర్శనం సందేహ మనస్తత్వానికి కారణం అతని ఎడంకాలు.... ఆ కాలు చిన్నతనంలోనే బాగా తోడుకుపోయి చచ్చుపడిపోయింది. చంక కింద కర్ర సాయంతో చచ్చుపడిన ఆ కాలుని




కొద్దిగా ఆధారం చేసుకుని నెమ్మదిగా కుంటుతూ నడుస్తాడు. కాలుకి తోడు నా అన్నవాళ్ళులేని అతని జీవితం అతనికి చుట్టూ జనం పట్ల మరింత జాగ్రత్తని నేర్పింది. ఆర్థికంగా తను బలంగా వుండటం అన్నది జీవితంలో అతని మొదటికోరిక. అది తీరింది.

బేంక్‌లో ఎకౌంటెంట్ సుదర్శనం ఆర్థికంగా జీవితంలో తొందరగానే ముప్పైఏడేళ్ళకే బాగా స్థిరపడ్డాడు. తనకి నచ్చి, ఆ తర్వాత తన శారీరక అవసరాన్ని వొప్పుకునే అమ్మాయికోసం జీవితంలో తోడుకోసం వెతుక్కుంటున్నాడు.

ఆ ప్రయత్నంలోనే సుజాత వివరాలు తెలిశాయి. వయసు ముదిరినా పెళ్ళి కాలేదన్న తొందరకి, కట్నాలిచ్చుకోలేని పరిస్థితికీ లొంగి తన కుంటితనాన్ని అంగీకరించి పెళ్ళికి సిద్ధపడే ఆడాళ్ళు వుంటారని సుదర్శనానికి తెలుసు.

అలాంటి పెళ్ళి కాదు సుదర్శనం కోరిక. తనకి కాలులేని లోటు తీరిపోయేంత మానసిక ధైర్యాన్ని అందివ్వగలిగిన ఆడది కావాలి. అందుకే తొందరపడకుండా అన్ని రకాల జాగ్రత్త తర్వాతే పెళ్ళి నిర్ణయించుకోవాలనుకున్నాడు.

సుజాత నడకలో, చూపులో, చేష్టల్లో ఎక్కడా బేలతనం లేకపోటం మొదటి రోజే ఆకర్షించింది సుదర్శనాన్ని. రెండో రోజు మరింత పరీక్షగా చూశాడు. తనకి అన్ని రకాలుగా తోడుగా నిలిచే గుణాలన్నీ సుజాతకి వున్నట్టనిపించాయి. కానీ మూడోనాడే ఆ చిన్న సందేహం తలెత్తింది సుదర్శనంలో.

ఆ చిన్న సందేహమే క్రమేపీ పెరిగి పెద్దదైంది. వారం రోజులు చూశాడు. సందేహం అనుమానంగా మారింది సుదర్శనానికి.

కట్టిన చీర కట్టకుండా కడుతోంది. రోజులోజుకి స్టైల్‌గా వుంటోంది.... వుత్సాహంగా వుంటోంది.

ముప్పైరెండేళ్ళొచ్చినా పెళ్ళికాని మనిషి.... యింటి పరిస్థితి అంతంత మాత్రమే అయిన మనిషి.... అంత వుత్సాహంగా అంత స్టైల్‌గా ఎలా వుండగలుగుతోందన్నది సుదర్శనం సందేహం.

తను పెళ్ళిచేసుకోవాలనుకోటం అన్న విషయం వొదిలేస్తే.... సుజాత అన్ని రకాలుగా తనకి సంబంధం లేని ఆడది అన్న విషయాన్ని కూడా పక్కకి నెట్టేసి సుదర్శనం అనుమానం పెరిగిపోయింది.

'వయసులో వుంది. చుట్టూ ప్రపంచం రెచ్చింగా వుంది. అవకాశం వుంది. ఒకవేళ ఎవరితోనేనా.... ఏమో.... ఎలా తెలుసుకోటం....'

'ఎన్ని వినటంలేదు.... ఎన్ని చూట్టంలేదు. ఏమో సుజాతా అలాంటిదే అయితే అలాంటి సుజాతనే తను చేసుకుంటే.... తన కుంటి బతుకు అవకాశంగా సుజాత....'

యీ రకం ఆలోచనల్తో సుదర్శనం మనసు వికలమైపోయింది. తనదైన మనిషి చెయ్యిజారిపోయినంత బాధ పట్టుకుంది.

అందరిలా తనూ ఏ రకం అవసరం లేని మనిషైతే ఆ దారి వేరు.... కానీ కుంటి బతుకుతో ఏం చెయ్యాలన్నా భయంగానే వుంది....' అనుకున్నాడు.

సుదర్శనాన్ని ఆశా వొదలటంలేదు.. భయం వొదలటం లేదు. కొన్నేళ్ళు శ్రమించి జీవితంలో కావాలనుకున్న ఆర్థికస్థితి సాధించాడు. యింక యిప్పుడు కావాల్సింది జీవితానికి తోడు. సుజాత అన్ని రకాలుగా తృప్తిగా వుంది. కేవలం యీ ఒక్క అనుమానం తీరిపోతే.... మర్నాటినుంచి బేంక్‌కి వారం రోజులు శెలవు పెట్టాడు. ఆ వారం పూర్తిగా సుజాతని పరీక్షించటమే కార్యక్రమంగా పెట్టుకున్నాడు.

ఎన్ని బాధలున్నా ఏ మనిషేనా వుత్సాహంగా వుండే అవకాశం లేకపోలేదు. అలాగే పెళ్ళికాకపోయినా, ముప్పైరెండేళ్ళ వయసున్నా సుజాత ఆ మాత్రం వుత్సాహంగా వుండటంలో తప్పులేదు. కానీ సుదర్శనం జీవితం చుట్టూ అతను చూస్తున్న పెళ్ళిళ్ళ

తతంగం.... ఆడ, మగల నిస్పృహ అతన్ని ఆ విషయం వొప్పుకోనివ్వటం లేదు.

'ఏదో వుంది....నిజం తెలుసుకోవాలి ....' అదే అతని భావన....పట్టుదల....

వారం రోజులు సుజాత వెనకే ఆమె ఆఫీసుకి వెళ్ళాడు. ఆమె రాకపోకల్ని జాగ్రత్తగా కనిపెట్టి చూశాడు. ఆఫీసులోకి వెళ్ళిన సుజాత ఏ రోజూ మధ్యలో బైటికి రాలేదు. సాయంత్రం ఒక్కోసారి ఆరింటికి, ఆరున్నరకి బైటికొచ్చేది. వొచ్చినప్పుడూ కూడా కొలీగ్స్ వుండే వాళ్ళు. అందరూ ఆడాళ్ళే....వెడితే వాళ్ళల్లో కొంతమందితో కలిసి సినిమాకి వెళ్ళేది....లేకపోతే ఒక్కోసారి ఏదేనా హోటల్‌కి వెళ్ళి యింత టిఫిన్ చేశాక ఎవరింటికి వాళ్ళువెళ్ళేవాళ్ళు. సుదర్శనం అనుమానానికి అనుకూలంగా ఆ వారంలో ఏం కనిపించలేదు. అయినా అతని అనుమానం తీరలేదు. ఇంక ఒక్కే అవకాశం కనిపించింది సుదర్శనానికి. సుజాత ఆఫీసులోనే ఎవరేనా ఆఫీసరుతో .... ఆఫీసర్లకి ప్రత్యేకంగా రూమ్ లుంటాయి.... ఏదో పని అని వెళ్ళొచ్చు...కానీ ఆ విషయం తెలియటం ఎలా....తను ఆఫీసులోకి వెళ్ళి రోజంతా కూచోలేడు.

దానికూ్కడా సుదర్శనానికి దారి దొరికింది. సుదర్శనం స్నేహితుడు విశ్వేశ్వరావు చెల్లెలు సుజాతతోటే పనిచేస్తోంది. ఆమె ద్వారా ఆచూకీ తియ్యాలనుకున్నాడు. విశ్వేశ్వరావుని కలిసి వివరాలన్నీ చెప్పాడు. చెల్లెలి ద్వారా వివరాలు తెలుసుకుని చెపుతానన్నాడు అతను.

సుదర్శనం పరిస్థితి విశ్వేశ్వరావుకి తెలుసు. అందుకే కొంచం యిబ్బందైన విషయమైనా సుదర్శనం అనుమానం సంగతి చెప్పి చెల్లెల్ని ఆచూకీ అడిగాడు.

* * *



సుజాతని చూస్తూనే వున్నాడు. సుందరం మనసులో అలజడి పడుతూనే వున్నాడు. విశ్వేశ్వరావు దగ్గర్నించి రావాల్సిన సమాచారం కోసం ఎదురు చూస్తూనే వున్నాడు.

వారం గడిచినా విశ్వేశ్వరావు దగ్గర్నించేం సమాచారం అందలేదు కానీ ఆదివారం పొద్దున్న వోసారి యింటికి రమ్మనమని సుజాత తమ్ముడి ద్వారా కబురుచేసింది.

'ఎందుకో'...అనుకుంటూనే వెళ్ళాడు సుదర్శనం.


అతని కోసమే ఎదురుచూస్తూన్న దానిలా ఎదురొచ్చి లోపలికి తీసికెళ్ళింది. ఇద్దరూ ఎదురెదురు కుర్చీల్లోకూచున్నారు.

"నా గురించి మీరు అడిగిన వివరాల సంగతి వూర్మిళ నాకు చెప్పింది...." అంది సుజాత.

ఏమిటో అర్థంకానివాడిలా చూశాడు సుదర్శనం ఆ మాటలకి.

"అదే....వూర్మిళ.... మీ స్నేహితుడు విశ్వేశ్వరావుగారి చెల్లెలు...." అంది సుజాత మరింత సూటిగా.

సుజాత అలా అనగానే విలవిల్లాడాడు సుదర్శనం. ఆమెని అవమానించాలనిగాని, తప్పుడు ప్రచారం చెయ్యాలనిగానీ తనీ వివరాలకోసం ప్రయత్నించలేదు. వ్యక్తిగతంగా తనకున్న బలహీ




నత, భయం తనిలా తాత్రయపడేలా చేశాయి. ఆ విషయం ఆమె కెలా చెప్పటం.

"అది కాదండీ.... మిమ్మల్ని అవమానించాలని గానీ.... మరో తప్పుడు వుద్దేశంతో కానీ నేను యిలా...."యింక మాట పెగల్లేదు సుదర్శనానికి.

"ఏమైనా కావచ్చు....కానీ నా పరిస్థితి గురించి ఏమైనా ఆలోచించారా.... వయసొచ్చీ పెళ్ళికాని అమ్మాయినన్న ముద్ర యిప్పటికే వుంది. నా జీవితం ఏమిటో, నా పరిస్థితి ఏమిటో యీపాటికి మీకు తెలిసేవుండాలి.... పూర్తిగా కుంచించుకు పోకుండా వున్నంతలో వుత్సాహంగా వుండాలన్న ప్రయత్నంలో వున్నాను.... మొన్నమొన్నటిదాకా యింటి బాధ్యతలు వూపిరి తీసుకోనివ్వలేదు. యిప్పుడిప్పుడే కొంచం పరిస్థితి బావుంది. అందుకే రెండునెలలుకో చీర.... అప్పుడప్పుడు వో సినిమా.... ఆఫీసులో తోటివాళ్ళతో కబుర్లు. యిలా నా వయసుకి కరువైన నిండుదనాన్ని కూర్చుకోవాలని చూస్తున్నాను.... రెండునెలలకి కొనుక్కునే వాయిలుచీర ఖర్చుతోటే.... సినిమాకి పెట్టే డబ్బుతోటో యిన్‌స్టాల్‌మెంట్స్ కింద కట్నం యిచ్చే అవకాశం వుంటే యీపాటికి భర్తనే చూసుకుని వుండేదాన్ని.... వున్నంతలో వుత్సాహంగా వుంటే మీలాంటివాళ్ళ లేనిపోని అనుమానాలు...." అంది సుజాత....

సుదర్శనం తల దించుకూచున్నాడు. అతని మీద అతనికే జాలిగా వుంది. కోపంగా వుంది.

"మధ్యవర్తుల ద్వారా పెళ్ళి విషయంగా మీ ప్రసక్తి వస్తే, శారీరకంగా మీకున్న లోపాన్ని నేను పట్టించుకోలేదు. ఇద్దరం వయసొచ్చిన వాళ్ళం.... జీవితానుభవం వున్నవాళ్ళం.... పరస్పర అవసరాలు.... యిబ్బందులూ తెలిసిన వాళ్ళం.... మానసికంగా యిద్దరి మధ్యా వో అవగాహన ఏర్పడుతుందని ఆశించాను.... కానీ యిప్పుడు మీరు చేసిన పనిని మాత్రం సహించలేను. నా విషయమనే కాదు.... ఎవరి విషయం లోనూ యిలాంటి అనుమానాలు పెట్టుకుని పెళ్ళికి ఆశపడకండి...." అంది తిరిగి సుజాత.

సుదర్శనం మారు మాట్లాడలేదు. అక్కడ్నించి లేచాడు. కనీసం సుజాత వేపు తలెత్తి చూసే ధైర్యం కూడా కలగలేదు. పదిహేను యిరవై రోజులుగా అనుభవించిన ఆ తీయటి బాధ కూడా ముగిసిపోయిందని తెలుస్తోంది అతనికి.

నెమ్మదిగా కుంటుకుంటూ వెళ్ళిపోతున్న సుదర్శనాన్ని చూస్తుంటే సుజాతకి మనసు బరువెక్కింది.

సుదర్శనాన్ని వెనక్కి పిలిచి....' 'నేనే అనవసరంగా ఎక్కువ ఆవేశపడ్డాను.... మీరు చేసింది ఏమంత ఘోరమైన తప్పేంకాదు.... వో మనిషి మనకన్నా వుత్సాహంగా, ఆనందంగా వున్నాడంటే తేలిగ్గా నమ్మలేనంత దరిద్రంలో వున్నాం.... మన చుట్టూ జీవితం అలా వుంది. పరోక్షంగా మన మందరం పిరిగ్గా బతికే స్థితిలోనే వున్నాం. అందుకని మీ మనసులో నా మీద అనుమానం పూర్తిగా తొలిగిపోతే తిరిగి రండి....' అనాలనుకుంది సుజాత, జారిపోతున్న అవకాశాన్ని చూస్తూ....

అయినా అనలేకపోయింది. గొంతెత్తి అరవటానికి కోరుకున్నది చెయ్యటానికీ యింకా పూర్తిగా అలవాటు కాని ఆడతనం, పరిస్థితులు అనుకూలించని ఆడతనం అడ్డొచ్చాయి.

